# స్వామి

జి. సుబ్రహ్మణ్యశాస్త్రి

**చదువుల తల్లి సరస్వతి తన స్వచ్ఛకచ్ఛపీ వీణను విశ్వమనోజ్ఞంగా వెూగిన్తూ గగనమార్గాన బయలుదేరింది.**

ప్రశాంత మౌనముద్ర దాల్చి ధ్యానమగ్నురాలైన భక్తురాలిలా కావేరీ నది శ్రీరంగనాథుని పదకంజదళాలు స్పృశింపనై నెమ్మదిగా అడుగు తర్వాత అడుగు వేస్తూ కదలి వస్తున్నది.

తమిళపాశురాలూ, తిరుప్పావై గీతాలూ కమనీయంగా ధ్వనితరంగాలై కోవెలల నుండి కోటి జనాల చెవులలోకి తరలి వస్తున్నాయి.


దూరదూరంగా తరుణభానూదయ సంకేతంగా విశ్వ సరోవరంలో అరుణకమలోదయంలా ఎర్రని కాంతుల్ని విసరుతూంది తూరుపు దిశ.

తన నీలిపైట చెరగు అలవోకగా కావేరీ అలలమీద శ్రీరంగ నగర శోభలమీద రెపరెపలాడిస్తూ పడమటికి తరలిపోతోంది రేరాణి.

ధనుర్మాసోత్సవ వేడుకలలో మునిగి తేలుతున్న భక్తజనం కావేరిలో మునకలు వేస్తూ 'రంగ! రంగ!' అంటూ మహదానంద పరవశంతో రంగనామస్మరణ చేసన్తూ శ్రీరంగనాథుని దర్శనంకోసం ఉరకలు వేస్తున్నారు.

ఆ వాడే కాదు, ఆ ఊరు కాదు, ఆ ప్రాంతం ప్రాంతమంతా పరమ భక్తాగ్రేసరుడని పేరుగన్న రామానుజశ్రేష్ఠి ఆ శరీరం చిట్లే ఎముకలు కొరికే చలివేళ సాధారణ వస్త్రధారియై కావేరిలో స్నానానికి వచ్చాడు.

"తొలగు! తొలగు!"



## నా బదులు

కమల తన కొడుకు సంతోష్ ని తీసుకుని స్నేహితురాలింటికి వెళ్లడానికి బస్‌స్టాప్‌కి వచ్చి కొడుకుతో చెప్పింది. "చూడు బస్‌లో సీట్ దొరకగానే కూర్చోకూడదు. నీకన్నా పెద్దవాళ్లకి ఆ సీట్‌ని ఆఫర్ చెయ్యాలి. అది మర్యాద. అర్థం అయ్యిందా?"

" అర్థం అయ్యింది మమ్మీ! " చెప్పాడు సంతోష్.

బస్ వచ్చి ఆగాక ఇద్దరూ ఎక్కారు. ఆఫీసుకు టైము అవడంతో కిటకిటలాడి పోతోందా బస్సు. ఓ ముప్పయి ఏళ్లాయిన నించోలేక అవస్థపడుతున్న సంతోష్‌ని చూసి చెప్పాడు " దా... నా ఒళ్లో కూచో!"

సంతోష్ వెంటనే తన పక్కనున్న అమ్మాయితో చెప్పాడు" ఏవండీ, ఆయన ఒ ళ్లో నా బదులు మీరు కూర్చోండి!"

**పి.వి. మురళీకృష్ణ**

"దూరం! దూరం!"

"శ్రేష్ఠివారూ దొడ్డవారు!" అంటూ ఎవరంతకు వారే రామానుజశ్రేష్ఠికి తెరవిచ్చారు.

ఆయన వెంట దాసదాసీ జనం లేరు.

పరిచారక వందిమాగధ బృందమూ లేదు.

ఛత్రచామరాందోళికాది హంగులూ లేవు.

రక్షకభటులో, అంగరక్షకులో అంతకన్నా లేరు.

అయినా ఆ దివ్య తిరునగరంలో రామానుజ శ్రేష్ఠిని తెలిసినవారందరూ ఆయనకంతగా మర్యాద చేస్తారు.

ఆయన కోట్లకు పడగలెత్తిన కుబేరుడు!

ప్రతిరోజూ ఎవరికో ఒకరికి ఏదో ఒక దానం చేస్తున్నట్లు పద్దులో లెక్క రాయక నిద్దరపోని మహాదాత!

ఏ దేవాలయం వెళ్లినా, ఏ పాఠశాల వెళ్లినా, ఏ మహాసభ జరిగే చోటు చూసినా, ఏ సంతర్పణ జరుగుతున్నా రామానుజ శ్రేష్ఠి పేరు కనిపించి తీరుతుంది.

కొన్నిచోట్ల తైలవర్ణచిత్రాలు, దారుశిల్పాలు, ఛాయాచిత్రాలు, శిలా ఫలకాలూ ... ఒక్కటేమిటీ 'రామనుజ శ్రేష్ఠి' నామాంకితం కాని తావే కనిపించదు.

శ్రీరంగరనాథునకైనా రామానుజ శ్రేష్ఠికంటే ఇంత వైభవం ఉండదనే జనం అనుకుంటూనే ఉంటారు.

అంతటి కోటీశ్వరుడూ అతి సామాన్య వ్యక్తిలా ఆ తెల్లవారువేళ కావేరీ నదికి స్నానానికి వస్తే అంత మర్యాద!

ఆ మర్యాదవాచకాలు శ్రేష్ఠి చెవిలో పడతాయి.

వింటూనే రాజగజంలా నడుస్తూ వెళతాడు శ్రేష్ఠి.

ఆ కదలని పెదాలమీద ఒక గంభీర హాసముద్ర.

ఆ ముద్రలో లీలగా కించిత్ గర్వరేఖ.

ఆ మసక చీకటిలో ఆ రేఖ ఎవ్వరికీ కనబడదు.

కానీ ఎవరికీ కనబడని ఆ రంగనాథునికి మాత్రం అవుపిస్తుంది. రంగనాయకివైపు చిరునవ్వుతో చూస్తాడాయన. ఆమె ముసిముసి నవ్వులు నవ్వుతుంది.

* * *

స్నానం చేసి తడి వస్త్రాలతోనే "శ్రీరంగ! రంగ!" అంటూ ధర్మదర్శనం వరుసలోకి వస్తాడు శ్రేష్ఠి.

"వద్దులే అప్పా! ఇక్కడ అందరమూ ఒక్కటే! ఆ దైవం ముందు నీవూ, నేనూ ఒక్కటే!" అంటాడు వినయంగా!

"ఆహా, ఎంత నిగర్వి!" అనుకుంటుంది జనం. ఆలయ పరివారం ఎవరో వస్తారు. శ్రేష్ఠిగారిని ముందుకు నడిపించుకుపోతారు.

సర్వకదంబమాలికాలంకృతుడైన శ్రీరంగనాథుని దివ్యమంగళరూపం చూడగానే "రంగ రంగా! శ్రీరంగా! శ్రీరంగా!" అని నోరారా స్మరించి, 'అడియేన్ దాసోహం రంగనాథనవరే!' అని సాష్టాంగపడబోయి అవాక్కయి అలాగే విగ్రహంలా నిలిచిపోతాడు శ్రేష్ఠి.

'ఎంత తన్మయత్వం! ఎంతటి నిశ్చలత్వం! ఆహా! అమోఘమైన అచేతనానంద మహదవస్థ!' అనుకుంటూంటుంది వెనక జనం, గుడిలోని అర్చక జనం.

శ్రేష్ఠి దృష్టికి శ్రీరంగనాథుని దివ్యమంగళరూపం కనడడంలేదు. ఆయన లీలామానుష మనోహరాకృతిలో ఒక వెక్కిరింతలాంటి నవ్వు! శ్రేష్ఠిని చూచే వెటకరిస్తున్నట్లుగా!

ఆయన పాదాలముందు దాసానుదాసుడై సాష్టాంగ ప్రణతి చేస్తున్న సేవాహజారుడు కనిపిస్తున్నాడు.

సకల లోకైక మాత రంగనాయకి తన దివ్య కరకమలాలతో అతని శిరమంటి ఆశీర్వదిస్తూ లేవనెత్తుతోంది.

అంజలిపుటం బంధించి అశ్రు నయనాలతో ఆ విశ్వజననీ జనకులకు మనసుని అర్పించి వెనుదిరిగిపోయాడు హజారుడు.

శ్రేష్ఠికి మేను జలదరించింది.

అర్చకులు తీర్థం వేశారు! ప్రసాదం పెట్టారు! శఠగోపాశీర్వాదం ఇచ్చారు.

శ్రేష్ఠి ముభావంగా బయటకు వచ్చాడు.

ఇల్లు చేరాడు. మనసు మనసులో లేదు.

శ్రీరంగనాథాలయం నమూనాలో కట్టించుకున్న తన దేవుని గదిలో వెళ్లి మౌనంగా కూర్చున్నాడు.

తదేకంగా రంగనాథునీ, రంగనాయకినీ, తదితర దేవతామూర్తుల్నీ చూచాడు.

సంక్రాంతి!

గత సంవత్సరం సంక్రాంతి గుర్తుకువచ్చింది.

జనసందోహం మర్యాదల్తో ముంచెత్తుతూంటే కావేరీ నదీ స్నానం చేసి సపరివారంగా రాచ మర్యాదల్తో స్వామి దర్శనానికి తనే తొలి ప్రవేశకునిగా వెళ్లి స్వామిని తిలకిస్తే ఏమి కనిపించింది?

రంగనాథుని పాదసరసిజాల చెంగట బాసెకట్టు వేసుకొని కూచొని స్వామి ఏమో చెబుతుంటే ఆనందబాష్పాలు రాలుస్తూ తల ఊపుతూ వింటున్న బాపూలాల్ కనిపించాడు.

అంతటి శీతాకాలంలోనూ ఒళ్లంతా వేడెక్కి చెమటలు కక్కింది.

అవాక్కయి మనసు మొద్దుబారి ఇంటికి వచ్చేశాడు శ్రేష్ఠి.

ఇదేమిటి?

ఏమనీ రంగనాథుని ఉద్దేశ్యం?

దక్షిణదేశమంతా తన పేరు పరిమళించిపోతోంది. దధీచి అన్నవారు కొందరు. శిబి అన్నారు. దానకర్ణుడు అన్నారు. విద్యాదాత అంటూ, అన్నదాత అంటూ వేనోళ్ల ప్రశంసిస్తూ ఎక్కడా తన పేరు చెక్కించి, లిఖించి, చిరంజీవం చేస్తున్నారు.అంతెందుకు? రంగనాథునికెంత చేయలేదు? అసలెంత చేయటంలేదు?

మహాగోపుర నిర్మాణం, కుంభాభిషేకం, మహాద్వార నిర్మాణం, జీర్ణోద్ధరణం, రథయాత్ర, నిత్యోత్సవాలు. అ...బ్బ! ఎన్నింటికని! తన చేయి లేకుండా స్వామి

వైభవం సాగుతున్నదా?

ఇవేమీ గమనింపడా స్వామి?

బాపూలాల్ ఎవరు? అతి సామాన్యుడు. సాధారణ తోటమాలి.

సేవాహజారుడెవడు? స్వామి ఆలయంలో కసవూడ్చే పల్లెవాడు!

ఈ దేశమంతా వద్దు. ఈ ఊళ్లోనే వారి పేర్లు ఎంతమందికి తెలుసు? మరిదేమిటి? నాకంటే ముందే స్వామి సన్నిధిలో అంత మర్యాదా? అసలు ఇన్ని దశాబ్దాల నా భక్తిసేవలో ఒక్కనాడు ... ఒక్కనాడైనా స్వామి అలా వలకరించాడా? అమ్మవారలా ఆశీర్వదించారా?

ఏమిటీ పక్షపాతం?

రామానుజ శ్రేష్ఠి హృదయం బాణట్లో వడలా కాలిపోతోంది.

'సంక్రాంతి కదా! అయ్యవారు ప్రత్యేక పూజలో ఉన్నారులా ఉంది. మనం ధ్యానభంగం చేయరాదు!' అనుకుని దూరంగా ఉండిపోయింది ఇంటి జనం.

మధ్యాహ్నం దాటింది. కుటుంబ పరివారానికి ప్రేగులు నకనకలాడాయి. పండుగ పిండివంటల ఘుమఘుమలు ఇల్లే కాదు, వీధి వీధంతా సోకి 'అన్నదాతా సుఖీభవ!' అనేందుకు పేదజనాన్ని బారులు తీర్చింది. ఎరుక నాంచారులూ, కొరవంజులూ, నందికోలాటల వాళ్లూ వస్త్రదానం, ధాన్యం స్వీకరించేందుకు బారులు కట్టి ఉన్నారు.

అంగళ్ల గుమాస్తాలూ, పొలం పాలేర్లూ కానుకలూ, కొత్త దుస్తులూ తీసుకునేందుకు సిద్ధంగా అరుగులమీద కూర్చొనున్నారు.

ఇంకా అయ్యవారు రాలేదు.

ఏమిటీ ఈ రోజు దొడ్డశెట్టివారు ఇంత ఆలస్యం చేస్తున్నారు.

అందరికీ విచికిత్స.

"అయ్యవారు పొద్దునగా ధ్యానంలోకి వెళ్లారు. ఇంకా బయటికి రాలేదు!" ఇంటి సభ్యుడు ఒకరు బయటి జనాన్ని సమాధానపరిచి వచ్చాడు.

పెద్దబ్బాయి కాస్త ధైర్యం చేసి వెళ్లి దేవుని గది తలుపు నెట్టాడు. రామానుజ శ్రేష్ఠి తలతిప్పి చూశాడు. ఆ ముఖంలో ఆ కళ్లలో ఏదో నిర్లిప్తత. అబ్బాయి మొదట విస్తుపోయినా, ఇన్నిగంటలసేపు కూచోటం కదా! అలసటలే అని సమాధానం చెప్పుకున్నాడు.

"అప్పా! బయట అతిథిదేవుళ్ళు ..." నసిగాడు.

శెట్టి ఒక్క క్షణం నొసలు చిట్లించాడు.

అబ్బాయి జడుసుకున్నాడు. ఇట్లా ఎన్నడూ లేదు.

వెంటనే శెట్టి మళ్లీ మామూలుగా అయిపోయి లేచి నిలిచాడు.

"ఏమోరా, పెద్దబ్బీ! ఈవేళ ధ్యానంలో ఒళ్లు తెలవరలేదు. స్వామితో ఒకటే చర్చ! చర్చే చర్చ! రా, పోదాము!" గంభీరంగా సాదాగా మాట్లాడుతూ బయటికి నడిచాడు.

"హమ్మయ్య!" ఊపిరి పీల్చుకున్నారు అందరూ.

అన్ని దాన కార్యక్రమాలూ అయిపోయాయి. పొగడ్తల నినాదాలే నినాదాలు.

వీధంతా హోరెత్తిపోయింది.

రంగనాథుని గుడిగంటల శబ్దమూ ఆ హోరులో వినపడలేదు.

ఆ గోపురం వైపుగా తలెత్తి చూచి శెట్టి గర్వంగా నవ్వుకున్నాడు.

ఇంటిల్లిపాదితో కలిసి సంబరంగా తృప్తిగా భోంచేశాడు.

* * *

రాత్రి నగరమంతా సద్దుమణిగింది.

దూరంగా రంగనాథుని కోవెలలో జరుగుతున్న సాంస్కృతికోత్సవాల తాలూకు ధ్వనులేవో అడపాదడపా లీలగా వినిపిస్తున్నాయి.

బాగా నిద్రపోతున్న మనస్సు ఉలికిపడి మేల్కొంది.

కళ్లు తెరిచినా, మూసినా శెట్టికి ఉదయం దేవళంలోని దృశ్యమే. నిరుటి సంక్రాంతి దృశ్యమే. మార్చిమార్చి కనిపిస్తోంది.

లేచి కూచొని చెంబెడు మంచినీళ్లు తాగి గట్టిగా కళ్లు మూసుకుని పడుకున్నాడు. అవే దృశ్యాలు! ఆ జగన్మంగళ మనోహరమూర్తి దరహాసాలు!

నెమ్మదిగా క్రమంగా నిద్రలోకి జారాడు శెట్టి.

ఎంతసేపయిందో తెలియదు.

"రామానుజం! రామానుజం!" ఎవరో భుజం తడుతున్నారు.

"మంచి నిద్ర పాడుచేశావయ్యా! ఎవరు నువ్వు? ఏం కావాలి?" కళ్లు నులుముకుంటూ లేచి కూర్చున్నాడు.

"చూడు ... ఎవరినో?"

శెట్టి బాగా తేరిపార జూచాడు.


సంభ్రమంతో తటాల్న లేచి, "స్వామీ! రంగా! శ్రీరంగా! అడియేన్ దాసోహం! శరణు! శరణు! శ్రీరంగనాథా!" అంటూ కాళ్లమీద పడ్డాడు.

రంగనాథుడు శెట్టిని లేవనెత్తాడు. దరహాస చంద్రికలు చల్లగా సాగుతున్నా శెట్టికి వెంటనే మరోలా సోకాయి. ముఖం చిన్నబుచ్చుకున్నాడు.,

"స్వామీ! మీరు సానా పక్షపాతం ఉన్న దైవమవు!"

"ఆహా! అలాగా? ఔనులే! బాపూలాలా, హజారుడూ నీకన్నా ముందు నా సన్నిధిలో ఉన్నారనేనా?"

"నేను చెప్పవలెనా? నేను నీకెంత సేవలు చేస్తిని? చేస్తుంటిని? మీకు తెలవదా? ఎంతమందికి ఎన్నిరకాలుగా సాయపడ్తుంటిని మీరు చూస్తురు కదా? నా



భక్తికి లోటేమి ఉంది స్వామీ! నాకెంత పేరున్నది సామీ! మళ్లీ నాకెంత చిన్నతనము మీరు చేస్తిరి."

"నిజమే. నీకెంత పేరున్నదో ఊరంతకీ తెలియును కదా! లే, నా వెంట ఒక్కమారలా విహారానికి రా! నీకో రహస్యం చెబుతాను."

రంగనాథుడు శెట్టిని వెంటబెట్టుకుని రంగనగరం వీథులలో తిప్పుతూ ఒక సత్రం వద్ద ఆగాడు.

"ఆహా! రంగనాథ మహిమే మహిమరా! చిన్న కణ్ణా! ఈ స్థలంలో ఎవరు వచ్చినా, ఎన్ని రోజులున్నా సాపాటు దొరకటం ఆ సామి చలవే!" ఒక బాటసారి అంటున్నాడు.

"ఔను కానీ, అన్నా! ఈ సత్రం రామానుజశెట్టి కట్టినాడంట కదా!"

"నిజమేరా కణ్ణా! ఎందుకు కట్టినాడంటవా? పేరు ... పేరుకోసంరా, నాయనా! కానీ ఈ సత్రం ఇంత చక్కగా నడుస్తూ ఉన్నదీ అంటే అంతా ఆ హజారుడి శ్రమ ఫలితంరా! హజారుడే లేకుంటే సత్రం పని ఖాళీ."

రంగనాథుడు శెట్టిని ముందుకు నడిపించుకుపోయాడు.

అందంగా ఉంది వీథి. అర్ధరాత్రి దాటినా ఇంకా జనం తిరుగుతూనే ఉందక్కడ. ఏదో ఉత్సవం జరుగుతోంది. స్వామి, శెట్టి ఓ పక్కగా నిలబడి చూస్తున్నారు.

"బాపూలాలా ఇక్కడకు రాకపోయుంటే ఈ వీధి ఇలా ఉండేదా? ఎక్కడెక్కడి అనాథలూ, కుష్టురోగులూ కుళ్లి చస్తూండేవారు. మహానుభావుడు బాపూ లాలా అందరిపాలిటా తానే దేవుడై వీళ్ల బాగోగులు చూచి వీళ్ల బతుకుల్లో సంక్రాంతి వెలిగించాడు. దేశానికేమోగానీ ఈ వీధి జనానికి మాత్రం ఇది నిజంగా సంక్రాంతి."


ఎవరో గొప్పాయన మాట్లాడుతున్నాడు. వింటున్న జనం చప్పట్లు కొట్టింది.

"అసలీ వీథేనేమిటి? నగరంలో ఎక్కడ ఎలాంటి అనాథ కనబడినా వాళ్లకు ఆశ్రయం కలిగించే దేముడండీ బాపూలాలా!" ఎవరో శెట్టి పక్క నిలబడి అంటున్నాడు.

స్వామి శెట్టిని ఇంకా ముందుకు పిలుచుకుపోయాడు. అలా అలా ఊరి బయటికి. "అరెరే!" అన్నాడు శెట్టి ఆశ్చర్యంగా, హఠాత్తుగా.

"ఏమి రామానుజం?"

"స్వామీ! ఇక్కడంతా కొండరాళ్లూ, దిబ్బలూ, కల్లుపాకలూ, జూదగాళ్లూ ఉండిన




రాళ్లాగ్రామం కాదూ?"

"అది ఒకప్పుడు. ఇప్పుడు చూడు, ఎంత సుందరంగా తీర్చిదిద్దినట్లు తయారయిందో? అక్కడ చూడు, ఔషధాలయం. అది బడి, అదిగో గుడి! ఆ నీళ్ల సరఫరా ఏర్పాటు చూచావా?" స్వామి చూపుతుంటే శెట్టి బిత్తరపోతున్నాడు.

"ఇదేమిటీ? ఇంతగా జరుగుతోంటే ఎవరూ నా దగ్గరకి రాలేదు?"

"ఎందుకు?"

"నేనూ విరాళం దండిగా ఇచ్చేవాడిని కదూ, స్వామీ!"

"నిజమే. ఎందుకు రాలేదంటావు?"

"అదే స్వామీ, నాకూ అర్థం కాలేదు."

"ఒకరిని చేయిచాచి యాచించకుండా ఎక్కడ ఎండిన మోడులుంటే అక్కడే సుందరవనం తీర్చిదిద్దే స్వయంకృషీవలుడు వీళ్లకి ఉన్నాడు కాబట్టి!"

"ఎవరా కృషీవలుడు స్వామీ?" ఆత్రంగా అడిగాడు శెట్టి.

"సేవా హజారుడే!" అంటూ రంగనాథుడు అదృశ్యమైపోయాడు.

రామానుజశ్రేష్ఠి తల తిరిగిపోయింది. ఊరంతా వాడవాడలా ఆ రాత్రి గడిచిపోయే వరకూ తిరిగాడు. ఎక్కడా నిరుపేదలు, అన్నార్తులు, బాధిత జనాల నోట బాపూలాలా, హజారుల పేర్లే కనిపిస్తున్నాయి.

శెట్టిని గురించి స్మరించేవారే కనబళ్లేదు.

ఒకవేళ ఎక్కడన్నా తన పేరు వినవచ్చినా, "ఆఁ, శెట్టికి కీర్తికండూతి జాస్తి! ఆయనదంతా అతిశయం! గర్వపోతు!" అనే మాటే.

"రంగా! శ్రీరంగా! జ్ఞానోదయమైంది ప్రభూ! నిజంగా నేను నీ భక్తుని కాను. కానే కాను ... కాను ...!" తన నేలకేసి బాదుకుంటున్నాడు.

"అప్పా! అప్పా! ఏమైంది? ఏమైంది?" పెద్దబాబు కుదిపి లేపాడు.

మంచంమీద కూర్చుని కళ్లు తెరిచి అందర్నీ చూచాడు. అందరి ముఖాలలోనూ భయం లాస్యం చేస్తోంది. శెట్టి మంచినీళ్లు తాగాడు. గుండె నిమురుకున్నాడు.

"ఏమీ కాలేదురా అబ్బీ! ఇన్నేళ్లూ కళ్లు మూసుకుపోయాయి. ఇప్పుడే తెరిపిడి పడినవి. భయపడవద్దు, వెళ్లండి! ఇప్పుడు నాకు హాయిగా నిద్రపట్టును" అంటూ పడుకున్నాడు.

దృశ్యాదృశ్యమూర్తిగా స్వామి రంగనాథుడు చిరునవ్వులో కనిపించాడు.

"శ్రీరంగా! త్వమేవ శరణం మమ!" అంటూ సుషుప్తిలోకి జారాడు రామానుజ శ్రేష్ఠి.

Ⓟ